క్లుప్తంగా

ఆదర్శం సచివాలయ వ్యవస్థ


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సిద్దవటం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు అన్నారు. సిద్దవటం మండలం ఉప్పరపల్లి గ్రామంలో గురువారం నూతనంగా నిర్మించి గ్రామ సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరువ బాలాజీ, ఉప మండలాధ్యక్షురాలు మల్లీశ్వరి, ఉప సర్పంచ్ మల్లికార్జున, సర్పంచ్‌లు చేపూరి ఓబయ్య, జానకిరామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అరుణాచలానికి బస్సు సర్వీసు

రాజంపేట : ఈనెల 26న రాజంపేట ఆర్టీసీ బస్టాండు నుంచి అరుణాచలంకు బస్సు సర్వీసును నడుపుతున్నట్లు రాజంపేట డీఎం గుండాల రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక సర్వీసు ఉదయం 6గంటలకు రాజంపేట నుంచి బయలుదేరుతుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ

ఓబులవారిపల్లె : శ్రీరామ జన్మభూమి, తీర్థక్షేత్ర ట్రస్టు వారి ద్వారా అయోధ్య శ్రీరాముడి పవిత్ర పూజిత అక్షింతలు గురువారం ముక్కవారిపల్లి అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నాయి. ఇక్కడి నుంచి అక్షింతలను మండలంలోని అన్ని గ్రామాలు, పంచాయతీలకు పంపిణీ చేశారు.

26 నుంచి ఆడుదాం ఆంధ్ర

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలలో శుక్రవారం నుంచి ఆయా గ్రామాల సచివాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు కలిసి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమావేశం నిర్వహించాలని ఎంపీడీఓ హైదర్ వలి తెలిపారు.

యాప్‌ల భారం తగ్గించండి

రాయచోటి అర్బన్ : గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీలపై ఆన్‌లైన్ యాప్‌ల నిర్వహణ భారాన్ని వెంటనే తగ్గించాలని గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి శంకరమ్మ, జిల్లా కార్యదర్శి ఉషారాణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. హెల్త్‌సెక్రటరీల సంఘం రాష్ట్రసమితి పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోసం హెల్త్‌సెక్రటరీలు గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

నందలూరు(రాజంపేట) : కౌశల్ జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచి రూ.750లు నగదు బహుమతి పొందడంతో పాటు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె. రూప, టి. మణిదీప్, టి. వైష్ణవిలు ఎంపికయ్యారు.

తెలుగు మహాసభలు

రాయచోటి టౌన్ : పట్టణంలో ఈనెల 23, 24వ తేదీలలో తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలుగు పండితులు రెడ్డెయ్య తెలిపారు. గురువారం రాయచోటి డైట్ కేంద్రంలో డీఈఓ శ్రీరాం పురుషోత్తం చేతులమీదుగా తెలుగు సాహిత్య పుస్తకాన్ని ఆవిష్కరించారు.

దుప్పట్ల పంపిణీ

రాజంపేట రూరల్ : హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్ తోపాటు పలు ప్రాంతాలలో రోడ్ పక్కన ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పి.వెంకటరమణ, నరసారెడ్డి, మణి, కృష్ణయ్య, శరత్‌బాబు, సుబ్బారావు, గంగరాజులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

రాజంపేట : ఆకేపాడు రహదారిలోని బాలిరెడ్డి పల్లి వద్ద బందల గణేష్ (19)ను ఎదురుగా వస్తున్న టాటా మ్యాక్స్ వాహనం బుధవారం ఢీ కొంది. గాయపడిన యువకుడిని మెరుగైన కోసం వేలూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌ఐలుగా రైతు బిడ్డలు

రామాపురం : మండల పరిధిలోని కల్పనాయినిచెరువు కస్పాకు చెందిన ఎర్రాని జ్యోతి 2023 సంవత్సరం అక్టోబర్ 10న రాసిన ఎస్‌ఐ నియామకాల్లో జోన్ – 4 మహిళా విభాగంలో 6వ ర్యాంకు (219 మార్కులు) సాధించింది.

ఒంటిమిట్ట : పోలీస్ అభ్యర్థుల ఎంపికలో మండల పరిధిలోని కొత్తమాధవరానికి చెందిన పోతిరెడ్డి నాగిరెడ్డి(28) అనే యువకుడు ఆర్‌ఎస్‌ఐగా సెలెక్టయ్యాడు.

వివాహిత ఆత్మహత్య

సంబేపల్లె : నారాయణరెడ్డిపల్లి పంచాయతీ కొండావాండ్లపల్లెకు చెందిన డి.శాంత(30) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు అనారోగ్యంతో గురువారం కొండావాండ్లపల్లెలోని తన నివాసంలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త రమేష్ సొంతపనుల నిమిత్తం కేరళలో ఉన్నట్లు సమాచారం. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అంబరాన్నంటిన జననేత పుట్టినరోజు వేడుకలు

- వాడవాడలా కేక్‌లు కట్ చేసి, బాణసంచాలు కాల్చుతూ సంబరాలు
- పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించిన పార్టీ శ్రేణులు
- రాజంపేటలో రక్తదానం చేసిన నాయకులు, కార్యకర్తలు


ఓబులవారిపల్లె: దుప్పట్లు పంపిణీ చేస్తున్న విప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డిలు


సిద్దవటం : కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


సంబేపల్లె: అన్నదానం చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి, చిదంబర్ రెడ్డిలు


చిట్వేలి : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం


పెనగలూరులో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


ఒంటిమిట్ట : పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


నందలూరు మండలంలో..


చిన్నమండెంలో కేక్ కట్ చేస్తున్న దేవనాథరెడ్డి


గాలివీడు మండలంలో..

రాయచోటి టౌన్ : అభివృద్ధి ప్రదాత, మాట తప్పని నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి రూరల్ పరిధిలోని నక్కవాండ్లపల్లె సమీపంలో నిర్మితమవుతున్న వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చెదరని చిరునవ్వే ఆయుధంగా, పోరాడే గుణమే బలంగా, మహానేత వైఎస్సార్ ఆశయాలే వారసత్వంగా, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో దేశంలో రికార్డు సాధిస్తున్నారన్నారని చెప్పారు. ప్రజా సంక్షేమంలో వైఎస్సార్ ఒక అడుగు ముందుకేస్తే జగన్ రెండడుగులు ముందుకేస్తున్నారని పేర్కొన్నారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వి.వెంకటేశ్వర్లు, ఏపీఐఐసీ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసుల రెడ్డి, సర్పంచ్ ప్రభావతమ్మ, తిరుపాల్ నాయుడు, ఎంపీటీసీ చిట్టెమ్మ, ఆంజనేయుల నాయుడు, వైఎస్సార్ సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారీ మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు(రాజంపేట) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నం నాగేంద్ర మూర్తి, జేసీఎస్ కన్వీనర్ కలీముల్లా ఖాన్‌ల ఆధ్వర్యంలో గురువారం నాగిరెడ్డిపల్లెలో జరిపారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు.

ఆశ్రమానికి అన్ని విధాల సహకరిస్తాం

ఓబులవారిపల్లె : జీవన జ్యోతి ఆనందనిలయం ఆశ్రమానికి అన్ని విధాల అండగా ఉంటూ ఆదుకుంటామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పాపిరెడ్డిపల్లి జీవనజ్యోతి ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 51వ పుట్టినరోజు వేడుకలను సర్పంచ్ జి.నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకు ముందు ముక్కవారిపల్లి పంచాయతీలో మారె సుకుమార్ ఆధ్వర్యంలో సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలో ప్రభుత్వవిప్ పాల్గొన్నారు. వైకోట గ్రామంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పెనగలూరులో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం పెనగలూరు మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అత్యంత ఘనంగా నిర్వహించారు. జగనన్న పుట్టినరోజు సందర్భంగా ఆసుపత్రిలో భారీ కేక్‌ను కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

గ్రామగ్రామాన జననేత జన్మదిన వేడుకలు

రైల్వేకోడూరు/రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకరించారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో సీఎం జగన్ పుట్టినరోజును పండుగలా నిర్వహించారు. ఉదయం కొరముట్ల సాయిబాబా గుడిలో 30 సంవత్సరాలు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అటవీశాఖ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డితో కలిసి పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, హేమనవర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, గుంటిమడుగు సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు పాలాభిషేకం

చిట్వేలి : మండలంలో జగనన్న పుట్టినరోజును పురస్కరించుకొని గురువారం ఉపాధ్యాయులు జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక విద్యావనరుల కార్యాలయ ప్రాంగణంలో మండలంలోని 1998 డీఎస్సీ ఉపాధ్యాయ మిత్రులందరూ కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సయ్యద్ ముస్తాక్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పలు అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టారని, పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యను అభ్యసించాలని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామనాథం, వైస్ ఎంపీపీ శంకర్, ఎంపీటీసీ మల్లికార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జ్యోతి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకులు జ్యోతి శివకుమార్‌రెడ్డి, జ్యోతి వాటర్‌షెడ్ చైర్మన్ జ్యోతి లక్ష్మిరెడ్డిల ఆధ్వర్యంలో కేక్‌ను రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కట్ చేసి పార్టీ నాయకులకు తినిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎన్.శ్రీనివాసులరెడ్డి, ఏ.క్రిష్ణచైతన్య, ఏ.రాజేశ్వరిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఆలయం గోపాలస్వామి, ఎం.వెంకటసుబ్బారెడ్డి, సయ్యద్ నూర్, నాయకులు పాల్గొన్నారు.

రాజంపేటలో 200 మంది రక్తదానం

రాజంపేట రూరల్ : సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలు అన్నారు. గురువారం సీఎం జగన్ పుట్టినరోజును నిర్వహించారు. వేడుకలలో పాల్గొనేందుకు ఏరియా ఆసుపత్రికి విచ్చేసిన వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. కేక్‌ను కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. అనంతరం 200 మందికి పైగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి పండ్లు అందజేశారు. తదనంతరం ఏరియా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దనరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ చిన్నికృష్ణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజు, డీఆర్‌సీ సాయిలీల, వైద్య బృందం, వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, భూమన శివశంకరరెడ్డి, కౌన్సిలర్‌లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలు ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సహకారంతో 220 మంది వలంటీర్‌లకు 2జతల దుస్తులు, బ్యాగ్‌ను అందజేశారు.

రాజంపేట ఆర్టీసీ డిపోలో..

రాజంపేట : రాజంపేట డిపోలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎస్ నరసింహులు, ఎంఎస్ వాసులు తదితరులు వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లో చేరారు. కార్యక్రమంలో డిపో నేత నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి, బాణసంచాలను కాల్చారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు సంక్షేమాలతో అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీపీ ఆఫీస్‌లో నిర్వహించారు. కేక్‌ను కట్ చేసిన ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులరెడ్డి, దున్నూతల రఘురాంరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : చిన్నమండెం మండల కేంద్రంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.

ప్రజారంజకంగా జగనన్న పాలన

సంబేపల్లె : రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, మాట తప్పని, మడమ తిప్పని నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గుట్టపల్లె పంచాయతీ అంకిరెడ్డిగారిపల్లెలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జగనన్న జన్మదిన వేడుకలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం మండం పరిషత్ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివరాం గౌడ్, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముకుందపురం నరేష్, మాజీ ఎంపీటీసీ సీతారామరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగూర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడల జగనన్న పుట్టినరోజు వేడుకలు

గాలివీడు : మండలంలోని గ్రామాలలోని వాడవాడల గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహిస్తూ, మరెన్నో పుట్టిన రోజు వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. మండల ఎంపీడీఓ కార్యాలయంలో, పలు చోట్ల కేకులను కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగభూషణ్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాల్గొన్నారు.

పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు మాత్రమే

- విద్యారంగంలో వైఎస్ జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు
- పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలన్నదే ధ్యేయం


రైల్వేకోడూరు: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డిలు

రైల్వేకోడూరు : పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు మాత్రమే అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ట్యాబ్‌లను అందించారు. ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలనే ఉద్దేశంతో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాంకేతిక పరిజ్ఞానం అందిస్తోందన్నారు. విద్యార్థినులు అందరూ వీటిని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

లక్కిరెడ్డిపల్లె : ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం 8వ తరగతి చదివే లక్కిరెడ్డిపల్లె బాలుర, బాలికల, ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెండో విడత ట్యాబ్‌లను స్థానికఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్యలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బైజూస్ పాఠాలు విద్యార్థుల పాలిట వరమన్నారు. విద్యాపరంగా ప్రపంచంతో పోటీపడేందుకు ఈ పాఠాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, మద్దిరేవుల అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమణయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో 68 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించినట్లు తెలిపారు.

పుల్లంపేట: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి చేతులమీదుగా బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. బాబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఈ ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జి చక్రధర్ రాజు, నాగ తిరుమల రావు, పాఠశాల ప్రిన్సిపాల్ రూత్ మేరి, కొమ్మ శివప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఉర్దూ హైస్కూల్, బాలికల హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ సుధామాధురి గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులునాయుడు, హెచ్‌ఎంలు పద్మజ, రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంబేపల్లె : ట్యాబ్‌లు ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తున్నదని, ఇది బోధనలో నవ శకానికి నాందిగా చెప్పవచ్చని సంబేపల్లె జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఉదయం పాఠశాలలో 8వ తరగతి చదివే 87 మంది విద్యార్థులకు రెండవ విడత ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీని ఎంఈఓ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ సుదీర్ రాజు, ఉపాధ్యాయులు చేశారు.

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందని ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మోద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగభూషణ్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు – నేడుతో పాఠశాలలను అభివృద్ధి చేస్తూ, విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించడంతోపాటు భవిష్యత్తుకు బంగారు బాట వేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మిదేవమ్మ, ఉమాపతిరెడ్డి, వైస్ ఎంపీపీ–2 శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మన్ రజిత, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలోని తెలుగు, ఉర్దూ ఉన్నత పాఠశాలలలోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. నాడు నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చడం జరిగిందని, విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని తెలిపారు. పీఎస్‌టీయు రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ హక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

ఎండీయూలకు రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి ఆదేశం

రాజంపేట : లబ్ధిదారులకు బియ్యం బండి అందుబాటులో ఉండి, సక్రమంగా పంపిణీ చేయాలని రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల బియ్యం బండి(ఎండీయూ) ఆపరేటర్లు, చౌక దుకాణ డీలర్లు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ జనవరి 1 నుంచి ప్రతి ఒక్క ఎండీయూ ఆపరేటర్ వారికి కేటాయించిన పాయింట్స్‌లో ఉండి బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. వలంటీర్లు కూడా మ్యాపింగ్ చేస్తారన్నారు. పంపిణీ సక్రమంగా లేకపోయినా, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చౌకదుకాణదారులు ఒకట తేదీలోపు ప్రతి చౌక దుకాణం నుంచి సరకులను దిగుమతి చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బియ్యం ఇంటింటికి వెళ్లి ఇచ్చేలా తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థను బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎండీయూ కేటాయించిన పాయింట్స్‌లో విధిగా రేషన్ అందజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీధర్‌రావు, రాజంపేట పౌరసరఫరాల డీటీ శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు విద్యార్థులు

సంబేపల్లె : మండలస్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షలలో సంబేపల్లె హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎం.నరసింహారెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం మండలస్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షను ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు వర్షిణి, నవ్యలక్ష్మి, అమృతలు ప్రథమ స్థానం పొందగా, పృథ్వీరాజ్, తరుణ్ కుమార్ గౌడ్, రుక్సానాలు ద్వితీయ స్థానం సాధించారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలోసమీర్ బాషా హరికొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మెన్ సమస్యలను పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : సచివాలయం జూనియర్ లైన్‌మెన్‌లను వెంటనే పరిష్కరించాలని జిల్లా సచివాలయ జీఎస్‌డబ్ల్యూఎస్ ఎనర్జీ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్‌లకు విన్నవించారు. బుధవారం జూనియర్ లైన్‌మెన్‌లు పట్టణ శివార్లలోని నూతనంగా నిర్మించిన స్పోర్ట్స్ స్టేడియం ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేను కలిశారు. వారు మాట్లాడుతూ జూనియర్ లైన్‌మెన్‌లను వెంటనే సచివాలయాలకు అనుసంధానం చేయాలన్నారు. ఇప్పటికే 140 మంది జేఎల్‌ఎంలు విద్యుత్ ప్రమాదాల్లో మరణించగా, మరో 300 మందికి పైగా ప్రమాదాల బారినపడి చికిత్సలు పొందుతున్నట్లు వివరించారు. ఈ మేరకు వారొక వినతిపత్రాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు వేర్వేరుగా అందచేశారు.

భవన నిర్మాణ అనుమతులలో అవకతవకలు

విచారణకు హాజరైన రాజంపేట డివిజనల్ పంచాయతీ అధికారి పార్వతి

నందలూరు(రాజంపేట) : భవన నిర్మాణ అనుమతులు పొందడంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట డివిజనల్ పంచాయతీ అధికారి పార్వతి సూచించారు. గురువారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గతంలో జరిగిన అవకతవకలపై ఆమె విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2017–18 సంవత్సరం నుంచి 2023వ సంవత్సరం వరకు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు సక్రమంగా లేవని పంచాయతీ సెక్రటరీ రాజేంద్రప్రసాద్ రెడ్డి కలెక్టర్ గిరీషా పీఎస్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు వచ్చామన్నారు. ఈ విచారణకు గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ రావును హాజరుకావాలని సమాచారం అందించగా ఆయన హైకోర్టులో పనుల నిమిత్తం హాజరు కాలేనని రాతపూర్వకంగా నివేదించారన్నారు. తదుపరి విచారణకు తప్పక హాజరు కావాలని నోటీసు పంపిస్తామన్నారు. 2017వ సంవత్సరం నుంచి పంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలకు సంబంధించిన రికార్డులపై ప్రజలకు ఉన్న అనుమానాలు తీరేందుకు అనుమతులకు సంబంధించిన నకలు కాపీలను ఈఓపీఆర్‌డీ సతీష్ కుమార్‌కు అందజేసి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన కాపీలను (రికార్డు) పరిశీలించి తప్పు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో తనతోపాటు నందలూరు, రాజంపేట ఈఓపీఆర్‌డీలు సతీష్ కుమార్, హరిప్రసాద్ రెడ్డి, పెనగలూరు పంచాయతీ సెక్రటరీ సుబ్బరాయుడు, హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలందరూ మెచ్చేలా సీఎం జగన్ పాలన

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : ప్రజలందరూ మెచ్చేలా జగన్ పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం జరిగిన లక్కిరెడ్డిపల్లె మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డితో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో పేదలకు పక్కా గృహాలు, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108, 104 పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మనస్సుల్లో స్థిరంగా నిలిచారన్నారు. సీఎం వైఎస్ జగన్ మాటిస్తే నెరవేరుస్తారని ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. 2019 ఎన్నికలలో రెండు పేజీల మ్యానిఫెస్టో ఇచ్చి ఇప్పటికి 99 శాతానికిపైగా హామీలు నెరవేర్చారన్నారు. చంద్రబాబు మాట మీద నిలబడే వ్యక్తి కాదని ప్రజలకు బాగా తెలుసనన్నారు. గత ఎన్నికలలో డ్వాక్రా, రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిన చరిత్ర చంద్రబాబుదన్నారు. నియోజకవర్గంలో శాంతి, అభివృద్ధే తమ విధానమన్నారు. దౌర్జన్యాలు, బెదిరింపులు, రౌడీయిజంలు ఎప్పుడూ చేయమన్నారు. వ్యాపారాలు, కాంట్రాక్టులు తమ వృత్తి కాదని, ప్రజా సేవే తమ వృత్తి అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఇప్పుడు అవిచేస్తాం, ఇవి చేస్తామని చెప్పేవాళ్లు కరోనా సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎక్కడికి పోయారని శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. వెలిగల్లు కాలువలకు మరమ్మతులు చేసి గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలలోని చెరువులకు సాగునీరుతో నింపామన్నారు. అర్హతే ఆధారంగా జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ అభివృద్ధి పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తీసుకెళ్లాలని శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలానే ఈనెల 28న రాయచోటిలో జరిగే బీసీ సాధికారిక బస్ యాత్రను విజయవంతం చేయాలి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, వైస్ ఎంపీపీ సమర సింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పోలి రెడ్డి సుబ్బారెడ్డి, కో–ఆప్షన్ సయ్యద్ అమీర్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, సిద్దక నాగిరెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.